# త్రికాలాబాధ్యమైన సత్యమును దర్శింపజేయటమే విద్యయొక్క లక్ష్యము

ఆస్తిక బుద్ధి పోయె మరియాదల ధర్మము రూపుమాసె బల్
నాస్తిక బుద్ధిహెచ్చె గురువన్నను శ్రద్ధయు పోయె భక్తికిన్
స్వస్తి సనాతన విద్యకు స్వస్తి వహించెడి కాలమయ్యెడిన్
నిస్తుల గౌరవాదరణ నేలకు కూలుచు వచ్చె విద్యలో
సద్విద్య చదివించి శాంతిని బోధించి
ధర్మంబు నేర్పెడి తండ్రి, తండ్రి
సన్మార్గమును జూపి సౌఖ్యజీవన మిచ్చి
దైవభక్తిని తెల్పు తండ్రి, తండ్రి
స్వార్జితంబునంత చక్కగా పంచిచ్చి
తత్త్వంబు గరపెడి తండ్రి, తండ్రి
సత్కుమారుని చూచి తనలోన సంతృప్తి
పొందు మహనీయుడే తండ్రి, తండ్రి
ఇట్టి తండ్రిని కలయట్టి సుతుడు తాను
అంకితంబగు ఆత్మకు శంకలేక
యింతకన్నను వేరెద్ది ఎరుకపరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

స్థూల జగత్తుకు, జీవలోకానికి, మానసిక సీమకు, సాంఘిక జీవితానికి మూలాధారమైవున్న పరమసత్యమునకు ప్రత్యక్షరూపమే విద్య. దివ్యమానవుని స్వరూప స్వభావములను, తీరు తెన్నులను విద్యాదర్పణమునందు మాత్రమే మనము

sri sathyasai vachanamrutam

చూడగలుగుతాము. సత్యస్ఫూర్తికి, పదార్థములయొక్క విచక్షణకు వున్న తేడాను నిరూపించునదే విద్య. సృష్టియొక్క రూపురేఖలనే తీర్చిదిద్ది అన్నికాలములకు వర్తించే సత్యాన్ని దర్శింప చేయటమే విద్యయొక్క లక్ష్యము. దివ్య మనస్తత్వాన్ని గుర్తించిన వ్యక్తి మాత్రమే సృష్టితో, సంఘముతో వ్యక్తినుండి ఆవిర్భవించిన సమస్త శక్తులతో ఏకత్వాన్ని అనుభవించగలడు. ఈ అన్నింటియందున్న సంబంధ బాంధవ్యాన్ని గుర్తింపజేసేదే విద్య. సృష్టిచే మానవుడు బంధింపబడక, సృష్టికి అధికారియైన ఈశ్వరత్వాన్ని తనయందు ఆవిర్భవింపజేసుకునే మార్గమునకు అవకాశము కల్పించునదే విద్య. నైతిక పరివర్తనకంటే, ఆధ్యాత్మిక పరివర్తన అత్యంత ఉత్తమమైనదనే మూలాధారమైన సూత్రాన్ని నిరూపించునదే విద్య. యావత్ సృష్టిలో మానవులనందరిని యేకత్వముగా కట్టి వుంచే సమతత్త్వమే విద్యయొక్క బోధ. ఆత్మద్వారా మానవుని ప్రకృతిలో ప్రవేశింపజేసేదే విద్యయొక్క లక్ష్యము. ప్రకృతియొక్క చైతన్యము వ్యర్థమైనది కానేరదు. ఈ ప్రకృతియొక్క చైతన్యమును అహంకార సూత్రములో కట్టినప్పుడే యిది వికృతతత్వంగా మారుతుంది. ఆత్మతత్త్వముతో దీనిని బంధించినప్పుడు యిది సుకృతతత్వంగా రూపొందుతుంది. వికృతికి, సుకృతికి వుండిన తేడాలు నిరూపింపజేసేదే విద్య. కోరికలచేత మానవుని బంధింపజేసి తనయొక్క స్వాతంత్ర్యమును వ్యర్థముగావించేది విద్య కానేరదు. జాతియొక్క సమతత్త్వాన్ని, దేశముయొక్క సమగ్రతను కాపాడి ప్రచార, ప్రబోధలద్వారా దేశమునకు శాంతి, భద్రతలను అందించటమే విద్యయొక్క లక్ష్యము. ఇట్టి పవిత్రమైన విద్యలనుగరపి విద్యార్థులను గృహస్థాశ్రమములోనికి పంపించే సమయమందు వారికి యీ విధమైన బోధలుచేసి, యీ ప్రాకృతమైన జీవితములో ప్రవేశించే సమయములో ఒక సమావేశము జరిపించి, ఆ సమావేశములో వారు మున్ముందు అనుసరించవలసిన పవిత్రమైన మార్గములను, పవిత్రమైన భావములను అభివృద్ధిపరచుకొనే నిమిత్తము ఏర్పరచినదే స్నాతకోత్సవము.

**జనని, జన్మభూమి ఈ రెండింటియొక్క తత్త్వమును చక్కగా గుర్తించుకున్నవాడే విద్యార్థి**

ఈ గురుకులములో విద్యనభ్యసించే సమయములో విద్యార్థి బ్రహ్మచర్య దీక్షను వహించి

sri sathyasai vahini

తనయొక్క జీవితమును పవిత్రమైనదిగను, ప్రశాంతమైనదిగను, నిర్మలమైనదిగను, నిస్వార్థమైనదిగను అభివృద్ధి పరచుకోవాలి. గృహస్థ, వానప్రస్థ, సన్యాసము అనే యీ మూడు ఆశ్రమములుకూడను యీ బ్రహ్మచర్య ఆశ్రమముపైనే ఆధారపడి వుంటున్నాయి. విద్యార్థి జీవితము పైమూడు ఆశ్రమములకు పునాదివంటిది. విద్యార్థులారా! విద్యా విషయమునందుగాని, వైజ్ఞానిక విషయమునందుగాని మీరు వెనుకబడిన మీ తల్లి యెంత వేదన పడుతుందో, నైతికముగా, ఆధ్యాత్మికముగా వెనుకబడిన బిడ్డలను చూచి అంతకు వేయిరెట్లు అధికముగా భారతమాత ఆవేదన చెందుతుంది. కనుక, జననీ జన్మ భూమిల శాంతిగోరి, భద్రతనుగోరి, ఆవేదన నిర్మూలముచేసి, ఆనందమును ప్రాప్తింపజేసే బాధ్యత విద్యార్థులపైన వుంటున్నాది. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని జనని, జన్మభూమి యీ రెండింటియొక్క తత్వాన్ని చక్కగా గుర్తించుకున్న వ్యక్తియే విద్యార్థి. ఈ సత్యాన్ని మీరు గుర్తించి మున్ముందు మీ జీవితాన్ని ప్రశాంతమైన, ఆదర్శవంతమైన జీవితముగా అనుభవించాలని నేను ఆశిస్తున్నాను.

**దేశమును తీర్చి దిద్దటమంటే మానవులను తీర్చిదిద్దటమే!**

విద్యార్థులారా! యీనాడు మీరు ఎవరిని పౌరులుగా విశ్వసిస్తున్నారో, ఎవరిని అధికారులుగా భావిస్తున్నారో, ఎవరిని రాజకీయంగా కాని, ఆస్తికంగా కాని నాయకులుగా మీరు విశ్వసిస్తున్నారో వీరందరుకూడను ఒకనాటి విద్యార్థులే! ఈ నాటి విద్యార్థులే రేపటి పౌరులు, రేపటి అధికారులు, రేపటి నాయకులు. ఈ సత్యాన్ని మీరు మరువరాదు. దేశమంటే మానవులనే సత్యాన్ని గుర్తించాలి. దేశమును తీర్చిదిద్దటమంటే మానవులను తీర్చిదిద్దటమే! మానవులను తీర్చిదిద్దటమంటే యేమిటి? నైతికముగా, ధార్మికముగా వారిని సంస్కరింపజేయటమే మనయొక్క ప్రధాన కర్తవ్యము. సంస్కరణమనగా మనయందున్న, నిత్యజీవితములోని దోషములను నిర్మూలము గావించి, పవిత్రతను, సద్భావములను అభివృద్ధి గావించటమే! జీవితమంతయుకూడను సంస్కారముపైనే ఆధారపడివుంటున్నాది. పండించిన ధాన్యమును సంస్కరించకుండా భుజించుటకు వీలుకాదు. దానిని సంస్కరించటమనగా ధాన్యమును పైపొట్టును తీసి బియ్యముగా చేసి దానిని వండుకొని

srisathyasaivecharamrutam

భుజించినప్పుడే దానికి సంస్కరణ యేర్పడుతుంది. పండిన ప్రత్తినికూడను అట్లే మనము ధరించుటకు వీలుకాదు. దానిని దారముగా చేసి, వస్త్రముగా సంస్కరింపజేసి తదుపరియే మనము దానిని ధరించి శీతోష్ణముల బాధనుండి దూరమవుతున్నాము. భూమిలో పుట్టిన ముతక బంగారముకూడను సంస్కరించినప్పుడే అది అపరంజిగా రూపొందుతున్నాది. కనుక సంస్కరణమనగా మన నిత్య జీవితములో వుండిన దురభ్యాసములు, దుశ్చేష్టలు, దుశ్చింతనలను దూరము గావించుకొని సద్భావములు, సదభిప్రాయములు, సత్ప్రవర్తనలను పోషించుకోటానికి ప్రయత్నించాలి. వ్యక్తియొక్క విలువ సంస్కరణపైననే ఆధారపడివుంటున్నాది.

**విద్యార్థులు భవనమునకు పునాదివంటివారు, వృక్షమునకు వేర్లువంటివారు**

అయితే యీనాడు ఆర్థికముగాగాని, ఆధ్యాత్మికముగాగాని, నైతికముగాగాని ప్రజలను సంస్కరింపజేసే అధికారము మరియు శక్తి ప్రభుత్వమునకు లేదు. అదే విధంగా ప్రభుత్వమును సంస్కరింపజేసే శక్తి, యుక్తులు ప్రజలలో లేవు. ఆధ్యాత్మిక దృష్టితో చూచినప్పుడు యిటు ప్రభుత్వమునకు గానీ అటు ప్రజలకుగాని సంస్కరింపజేసే శక్తి సామర్థ్యములు లేకపోవటంచేతనే, యీనాడు విద్యార్థులయందు యిట్టి పవిత్రమైన సంస్కరణ పోషించటానికి, అభివృద్ధి గావించటానికి తగిన కృషి సల్పాలి. బాల్యస్థితియందే, విద్యార్థిస్థితియందే తనయొక్క జీవితాన్ని చక్కగా మలచటానికి ప్రయత్నించాలి. విద్యార్థి భావి జీవితములో ఉత్తమమైన పౌరుడుగా రూపొందే నిమిత్తమై యీనాడు చక్కని అభ్యాసములచేత తన జీవితమును పోషించుకోటానికి ప్రయత్నించాలి. విద్యార్థులు భవనమునకు పునాదివంటివారు. వృక్షమునకు వేర్లువంటివారు. కనుక, యీ విద్యార్థి దశను మనము దుర్వినియోగపరచకుండా పవిత్రమైన భావములచేత దీనిని అభివృద్ధి గావించినప్పుడే శాంతి అనే భవనముచేత జీవితములో ఆనందాన్ని అనుభవించటానికి వీలవుతుంది.

**విజ్ఞాన శాస్త్రమును సద్వినియోగము చేసుకొనలేకపోవటమే సమస్త అనర్థములకు మూలకారణము**

sri sathyasai vahini amrutam

ఈనాడు సాంకేతిక విజ్ఞానశాస్త్రము విరివిగా పెరుగుతూ వచ్చింది. యిది ప్రజలకు అనేక విధములైన అనుకూలములను, సదుపాయములను చేకూరుస్తూ వచ్చింది. అయితే ఎంత అనుకూలము, ఎంత ఉపకారము, ఎన్ని లాభములు చేకూర్చినా దానికి అనేక రెట్లు నష్టము, బాధలు, దుఃఖములుకూడా పెరుగుతూ వస్తున్నవి. దీని వలన ఉపకారముకంటే అపకారమే అధికముగా జరుగుతూ వస్తున్నాది. నిజానికి, విజ్ఞానశాస్త్రములో దోషములేదు. కానీ, దీనిని వినియోగించుకునే విధానములో వివేకము శూన్యము కావటమే దీనికి కారణము. విజ్ఞానముతోపాటు వివేకము వుండినప్పుడే యీ విధమైన సాంకేతిక శాస్త్రము సద్వినియోగపరచుకోటానికి సాధ్యమవుతుంది. ఇది నవీన నాగరికతాయుగము. అయితే, యీ యుగములోపల అనేక విధములైన కొన్ని అపశృతులు చేరటంచేత మానవత్వములోపల వున్న దివ్యత్వాన్ని విస్మరింపచేస్తున్నాది. ఈనాటి మానవ జీవితము కేవలము ఒక విధమైన భోగముగా అనగా సుఖసంతోషములతో తులతూగవలెనని ఆశించే రీతిలో మారిపోయింది. అయితే, ఇందుకు విరుద్ధముగా మానవుడు అనేక కష్టములను అనుభవిస్తున్నాడు. దీనికి కారణమేమిటని మానవుడు గుర్తించుకోటానికి తగిన ప్రయత్నం చేయటంలేదు. విలాసజీవితములోపలే తన జీవితమునంతయుకూడను వ్యర్థము గావిస్తున్నాడు. నిత్యజీవితములో సరియైన విలువలను గుర్తించుకోలేకపోతున్నాడు. ఈనాటి యుగముయొక్క విచిత్రమైన విలువలు ఏమిటి? సినిమాలు, విమానాలు అధికమైపోయాయి. రేడియోలు, వీడియోలు అధికమైపోయాయి. టెలిగ్రాములు, టెలిఫోనులు అధికమైపోయాయి. ఈ విధమైన అనుకూలములు అధికము కావటంచేత మానవుని మనసు విశ్రాంతిలేని మనసుగా తయారైంది. జీవన వ్యయము అధికముగా పెరిగిపోతూవస్తున్నాది. యీ వ్యయమును భరించుకోలేక మానవుడు అనేక విధములైన తికమకలకు గురవుతున్నాడు. ఒక వైపున యుద్ధ భయము, మరొకవైపున కరవుకాటకముల భయము మానవజాతిని పట్టి పీడిస్తున్నాయి. ఈ అన్నింటికి మూలకారణము విజ్ఞానశాస్త్రమే! మానవుడు క్షణక్షణముకూడను భయభ్రాంతులతో జీవితాన్ని గడపుతూ వస్తున్నాడు. వంటరిగా యింటిలో వుండటము భయమే! బయటకు పోవటము భయమే! ఏవిధమైన కార్యము చేయాలన్నా భయమే! భద్రత శూన్యమై

sri sathyasai vachanamrutam

పోయింది. ఆనందము అత్యంత దూరమైపోయింది. నిరాశతో, నిస్పృహతో మానవుడు కృంగి, కృశించిపోతున్నాడు. దీనికంతకు మూలకారణము అనేక విధములుగా ఆర్థిక వ్యయము పెరిగిపోవటమే! తర్వాత, మానవుడు అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములచేత కొంత దారితప్పి నడుస్తున్నాడు. అవినీతి పెరగటానికి మూలకారణము యిదియే!

**సాంకేతిక విజ్ఞానము మానవుని పెడమార్గమును పట్టిస్తున్నది**

ఒక చిన్న ఉదాహరణము. ఈనాడు ఒక మధ్యతరగతి ఉద్యోగిగాని, ఏ గుమాస్తాగానో పనిచేసే ఉద్యోగిగాని దీనిని భరించలేకపోతున్నాడు. తమ బిడ్డలను చదివించుకోటానికికూడ చాలా శ్రమ పడిపోతున్నాడు. బిడ్డను స్కూలులో మొదటి తరగతిలో ప్రవేశపెట్టాలంటే కొన్ని లక్షలు వ్యయము చేయాలి. ఇంతటితో తీరక ప్రక్కింటిలోపల రేడియోనో, వీడియోనో వుంటున్నాది అంటే యీ యింటిలో వున్న యిల్లాలుగాని, పిల్లలుగాని ఆ యజమానిని బాధిస్తూవుంటారు. తమ యింటికికూడను ఒక రేడియో, వీడియో కావాలని ఆశిస్తారు. తనకు వచ్చే కొద్దిపాటి జీతములోపల యీ రేడియోలు, వీడియోలు తాను యే విధముగా సంపాయించగలడు? ఈ సాంకేతిక విజ్ఞానము పెరిగిపోటంవలననే యీ విధముగా మారిపోతుండాది. అందువలననే ఆలు బిడ్డలను సంతృప్తిపరచే నిమిత్తమ తాను అప్పో లేక లంచమో తీసుకోటం ప్రారంభమవుతున్నాది. ఈ విధంగా అవినీతి మార్గములో ప్రవేశించటంచేత క్రమక్రమేణా ఇది పెరిగిపోతూ వస్తున్నాది. జీతము తక్కువ, యింటి ఖర్చులు యెక్కువ. భార్యాబిడ్డలను సంతోషపెట్టాలి. ఈ యజమానుడేమి చేస్తాడు? ఈ కారణములచేత అవినీతికి పాల్పడుతున్నారు. యీ విధంగా సాంకేతిక విజ్ఞానమనేది మానవుని పెడ మార్గమును పట్టిస్తూ వుంటున్నాది.

ఒక student M.B.B.S. చేశాడనుకోండి. లేక B E పాస్ చేశాడనుకోండి. ఆ తల్లితండ్రులు ఎంతో శ్రమపడి యితనిని చదివిస్తూ వచ్చారు. ఉద్యోగమో లేక వైద్య ప్రాక్టీసో చెయ్యాలి. ఉద్యోగము అంత సులభంగా చిక్కటం లేదు. ప్రాక్టీసు చేసుకోవాలంటే యీ కలియుగములోపల ఆడంబరము అధికముగా చూపించాలి. ఏ బ్యాంకులోనో లోను

sri sathyasai vahamrutam

తీసుకొని కారు కొనాలి, లేకపోతే మోటారుసైకిలు కొనాలి. ఇంటిలో పస్తులుండినా కాని యీ డాక్టరు, యీ లాయరు వీళ్లంతాకూడను బజార్లో కార్లలో ప్రయాణం చెయ్యాలి. ఈ ఖర్చులు భరించాలంటే వీరు యేమి చెయ్యాలి? తప్పనిసరిగా ఇందుకొరకు నీతినియమాలను తప్పి నడుస్తూ వస్తున్నారు. ఒక పేషెంటుకు దగ్గు, పడిశము పట్టింది. తక్షణమే వానికి రెండు మాత్రలైతే యిది నయమైపోతుంది. కానీ యీ పేషెంటుకు త్వరలో నయమైపోతే డాక్టరు కేమాత్రము ధనము చేరదు. రెండణాలతో జబ్బును నయము చేయవలసిన యీ రోగికి ఒక వారము రోజులు మందులు వాడి అతడి రోగమును పెంచుతారు. ఈ విధముగా వానిని రోగిష్టిగా పెంచకపోతే యీ డాక్టరు కడుపునిండదు. అందుకోసమనే చెప్పారు, ఆంధ్రలోపల. "పక్కింట్లో ఘొల్లుమంటే డాక్టరు చేతిలో ఘల్లు మంటుందట!" ఇంక లాయర్లు యే విధముగా వుంటుంటారంటే యేదో చిన్న accident జరిగింది. దానికి వానికి రెండు రూపాయలు ఫైను వేస్తే అంతటితో తీరిపోతుంది. ఆ చిన్న కేసును సంవత్సరములకొద్ది నడుపుతూ వస్తుంటారు. ఆ విధముగా కాలమే వీరు గడపకపోతే వీరికి ఫీజురాదు. ఈ విధంగా సాంకేతిక విజ్ఞానమునందు యే విధమైన యిబ్బందులు అభివృద్ధి అవుతున్నాయో మీరు యోచించుకోవచ్చును. మానవునియందు నీతినిజాయతీలు శూన్యమై పోతున్నాయి. ఈ నీతినిజాయతీలే లేకపోతే మానవుడే కాదు. కనుక నేటి విద్యార్థులందరుకూడను యీ సత్యాన్ని గుర్తించి భవిష్యత్తులో మీరు నీతినిజాయతీలతో జీవితాన్ని గడపాలని ఆశిస్తున్నాను.

**విద్య జ్ఞాన సముపార్జనకొరకు, ఉద్యోగనిమిత్తము కాదు**

ఉద్యోగము నిమిత్తమై విద్యను నేర్చుకుంటున్నామనే భావాన్ని మీరు దూరము చేసుకోండి. జ్ఞాన సముపార్జన నిమిత్తమై మేము చదువుతున్నామనే సత్యాన్ని గుర్తించండి. మన జీవితమును పరోపకారసంబంధమైన కార్యములో ప్రవేశపెట్టాలి. సోదర మానవులను ప్రేమతో చూడాలి. ఈ స్నాతకోత్సవమునందు గురువుల బోధనలు యివే! మిమ్ములను కని, పెంచి, అభివృద్ధి గావించిన తల్లి తండ్రులను ప్రేమించాలి. తాము పస్తుండి పిల్లలు అభివృద్ధిలోకి రావాలని యెంతమంది తల్లితండ్రులో ఎన్నో అవస్థలకు గురౌతున్నారు.

sri sathyasai vahamrutam

కనుక, మొట్టమొదట మాతృదేవోభవ అన్నారు;. మాతాపితరులనే దైవముగా భావించుచూ వారిని సంతోషపెట్టుటకు తగిన కృషి చెయ్యండి. పరులు గౌరవించదగిన కర్మలే మనము ఆచరించాలి. పెద్దలను గౌరవించాలి. దేశమును ప్రేమించాలి. ఈ విధమైన సుబోధల నందుకొని గురువుల ఆశ్రమములనుండి, వారి వియోగము భరించుకొనలేక విచారముతో తమ గృహములు చేరేవారు, ఆనాటి విద్యార్థులు. ఆనాటి విద్యార్థులకు అతి మధురమైన అనుభవాలను అందించిన కారణంచేత, విద్యార్థులు తమ జీవితములలో ఆదర్శమునందుకోవాలనే తపన పంచుకోవటంచేత, విడువలేక విడువలేక వియోగ బాధతో కృంగిపోయేవారు. సంయోగ, వియోగ సంరక్షణాత్మకమైన మహోత్తాల తరంగమైనదే జీవితమనే సత్యాన్ని ఆ వియోగ సమయములో గుర్తించుకోటానికి ప్రయత్నించేవారు. గురుదేవుల సుబోధలన్నియుకూడను సువర్ణాక్షరములతో హృదయమునందు లిఖించుకుని, పోషించుకొని, శిరస్సునందు ధరించుకొని అత్యంత వినయ, విధేయలతో గురువులను గౌరవించేవారు, విద్యార్థులు.

ఇందుకు విరుద్ధముగా యీనాటి స్నాతకోత్సవములు అల్లర్లు, అసభ్య ప్రవర్తనలతో అవిశ్వాసముతో నిండి గందరగోళంగా ముగుస్తున్నాయి.

**పాపభీతి లేని పామరత్వముబట్టి**
**దైవప్రీతి లేని దానిబట్టి**
**మానవత్వమడగె మానవులందున**
**విశ్వశాంతికిదియె విప్లవంబు**

పాపభీతి, దైవప్రీతి రెండూ లేకపోతే విశ్వమనేది విప్లవంగా తయారౌతుంది. ఆరాజకముగా రూపొందుతుంది. దైవప్రీతి, పాపభీతి మనయొక్క నేత్రములు. ఈ రెండు నేత్రములు లేకపోతే మనము అంధులమై పోతాము. అజ్ఞానులమై పోతాము. ఎంత విద్య చదివినవాడైనా కేవలము మూర్ఖుడుగా రూపొందుతాడు.

**విద్యార్థియందు వినయమే లేకపోతే వాడు విద్యార్థియే కాదు**

ఈనాడు పవిత్రమైన గుణములచేత తన జీవితమును ప్రకాశింప జేసుకొని, పరులకు



sri sathyasai vachanamrutam

వుపకారమైన రీతిగా కాలము గడిపే వ్యక్తి కంటికి కానరావటంలేదు. సత్యవర్తన, శాంతి, ధర్మము యీ గుణములచేత వర్ధిల్లే విద్యార్థులుగా మీరు తయారుకావాలి. కేవలము విదేశ సంస్కృతులనుగాని, విదేశ అనుకరణనుగాని యేమాత్రము పాటించరాదు.

**భరతశాస్త్రమను బంగారు మనకుండ**
**పరశాస్త్రములయెడ భక్తియేల?**
**కోరిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ**
**పెరటి పుష్పమునకై ప్రీతి యేల?**
**అడిగిన పాలిచ్చు కామధేనువె రాగ**
**ధనమిచ్చి ఆవును కొనగనేల?**
**మండెడు కాంతితో మేరు పర్వతముండ**
**వెండి బంగారులకై వెదుక నేల?**
**భక్తి, భుక్తి, ముక్తి నిచ్చెడి పరమాత్మ నేనుండ**
**పాడు చదువులనెల్ల కోరనేల?**

భారతీయులయొక్క శాస్త్రములు మహాపవిత్రమైనవి. దివ్యమైనవి. ప్రశాంతమైనవి. ఇలాంటి విలువైన బంగారు మనకున్నప్పుడు విదేశీ విద్యను మనమెందుకు ఆశించాలి? చదువులయందు వుండిన సారము వినయ, విధేయతలు. విద్యార్థియందు వినయమే లేకపోతే వాడు విద్యార్థియే కాదు. కేవలము మూర్ఖుడుగా తయారౌతాడు. కనుక మన విద్యార్థులంతాకూడను ఆదర్శవంతమైన విద్యార్థులుగా ఆనందమయ జీవితాన్ని గడిపి, సుఖశాంతులతో జీవిస్తూ, యితరులకు సుఖశాంతులనందిచ్చే వ్యక్తులుగా రూపొందాలి.

**క్రమశిక్షణ లేకపోతే మానవుడు పశువుగా మారతాడు**

విద్యార్థులారా! మన విద్యాసంస్థలందు ప్రధానమైనది, క్రమశిక్షణ. ఈ క్రమశిక్షణ అనేది కేవలము విద్యాసంస్థయందు విద్యనభ్యసించునంత కాలమే కాదు. మీరు ఎక్కడికి పోయినప్పటికి, మీ నీడ మిమ్ములను వెంటాడినట్టుగా క్రమశిక్షణ మీ వెంట ఉండాలి. క్రమశిక్షణ లేకపోతే మానవుడు పశువుగా మారతాడు. మీరు పశుపతిగా మారాలిగాని,

sri sathyasai vachanamrutam

పశువుగా కాదు. ప్రపంచములో యిన్ని విశ్వవిద్యాలయములున్నప్పటికి మనము యింకో విశ్వవిద్యాలయము స్థాపించుటలో వుండిన అంతరార్థమును మీరు గుర్తించాలి. కేవలము విద్యను మాత్రమే అభ్యసించటము కాదు. విద్యతోబాటు వినయ, విధేయతలను వివేక విజ్ఞానములనుకూడా పోషించుకుని, దేశానికి తగిన వీరులుగా మిమ్మల్ని తయారు చెయ్యాలనే మా వుద్దేశ్యము, అలాంటి విద్యార్థులు తయారుకావాలని ఆనాటినుండి నేటివరకుకూడను నేను ఎదురుచూస్తున్నాను.

**వెతుకుచున్నాను నేను వెతుకుచునే యున్నాను**
**వెతుకుచుంటి నాడు నేడు నిజమానవ విద్యార్థిని ॥వె॥**
**కొదువలేదు నరులకు నన్నూరు కోట్లున్నారు**
**నరరూపములె జూచితి నిజరూపము కాంచనైతి ॥వె॥**
**బూరుగకాయలు చూచి మామిడియని భ్రమసినట్లు**
**వెత్తి చెరకును చూచి చెఱకని నమిలినట్లు ॥వె॥**
**కలికి రాళ్లరూపము జూచి కలకండని భ్రమసినట్లు**
**రూపుచూసి మోసపోకు గుణమే యిది నరుని రూపు ॥వె॥**

కేవలము ఆకార మానవుడు కాదు, మనకు కావలసినది. గుణమానవుడు కావాలి, మనకు. కనుక మీరందరూ గుణాన్ని పెంచుకునే విద్యార్థులుగా తయారుకావాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

విద్యార్థులారా! విద్యార్థియొక్క తత్త్వాన్ని మీరు ఎంతగానో అర్థము చేసుకోవాలి. అర్థము చేసుకున్నదానిని ఆచరణలో పెట్టాలి. ఆచరణలో పెట్టిన దానిని హృదయానికి హత్తుకునేటట్లుగా అనుభవించాలి. అట్లు అనుభవించిన ఆనందమునే పరులకు అందించాలి. మితిమీరిన కోరికలచేత మతులు చెడకొట్టుకొనుటకు మనము ప్రయత్నించరాదు. మన కోరికలను అదుపులో నుంచుకొని, అవసరమైనదానినే పెంచుకొని, దుర్గుణములను దూరము చేసి, సద్గుణములచేత మొట్టమొదట మీ యింటిని మీరు సరిదిద్దుకోవాలి. తల్లితండ్రులను ప్రసన్నులను గావించుకోండి. తల్లితండ్రులకు

sri sathyasai vachanamrutam

మీరు దుఃఖము నిస్తిరా మీ జీవితము పూర్తి దుఃఖములోనే మునిగిపోతుంది. ఈనాడు తల్లితండ్రులకు మీరు యెంత ఆనందాన్ని అందిస్తారో రేపటిదినము మీ బిడ్డలు మిమ్మల్ని అంత ఆనందపరుస్తారు. యీనాటి విద్యార్థులు అహంకారముచేత తల్లితండ్రులను లక్ష్యము చేయటములేదు. ఇది చాలా తప్పు. 'మాతృదేవోభవ', 'పితృదేవోభవ', 'ఆచార్యదేవోభవ', 'అతిథిదేవోభవ', యీ నాల్గింటిని శ్రద్ధగా ఆచరించి, ఆనందించి, దేశానికి ఆదర్శమును అందించాలని నేను ఆశిస్తున్నాను.

**(తేదీ 22-11-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam